ప్రజాశక్తి
సోమవారం 29 జులై 2024 5
పార్వతీపురం మన్యం

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి కూడలిలో ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు ఆదివారం చేపట్టారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వాహన తనిఖీలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు. బత్తిలి ఒరిస్సా సరిహద్దు ఆనుకుని ఉండడంతో బత్తిలి మీదుగా ఒడిశా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు. కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జోగింపేట కళాశాలలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట ప్రతిభా కళాశాలను (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సు) జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో వంటగది, సరుకుల నిల్వ గది, డార్మిటరీలు, పరిసరాలు, డైనింగ్ హాల్ క్షుణ్ణంగా పరిశీలించారు. సరుకుల రిజిస్టరు, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. సరుకులను జాగ్రత్తగా నిల్వ చేయాలని ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతలో రాజీ లేదని, బయట చెత్త కుండీలు ఏర్పాటు చేసి వాటిని ఉపయోగించాలని సూచించారు.

ఉన్నత శిఖరాలు ధ్యేయం కావాలి

భోజనం చేస్తున్న విద్యార్థుల మధ్యనే కూర్చుని భోజన నాణ్యత, విద్యా బోధన, అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉన్నత లక్ష్యంతో చదువు కొనసాగించాలని ఆయన సూచించారు. నలుగురికీ సహాయ పడే స్థాయికి చేరాలని, అందులో అమితమైన సంతోషం, ఆనందం, సంతృప్తి కలుగుతుందని చెప్పారు. విద్యా సంవత్సరం ఆరంభంలో ఉన్నామని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. జెఇఇ మెయిన్స్, ఇతర జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల పట్ల పూర్తి అవగాహన పొందాలని తద్వారా వాటిలో మంచి ర్యాంకులు సాధించగలమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఆసక్తిగల రంగాల్లో గొప్ప ప్రతిభా వంతులుగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంపొందిస్తూ వారితో వాలీబాల్ ఆడారు. క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకొర ఎరువు... అన్నదాత ఆందోళన

ఒక్క బస్తాతో సరిపుచ్చుతున్న అధికారులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఈ ఏడాది మన్యం జిల్లాలో తగినంత వర్షపాతం లేకపోయినా ముందుగా కురిసిన చిన్నపాటి వర్షాలకు వేసిన నారు ముళ్ళు అందుకు వచ్చాయి. దీంతో నారు ఎక్కడ ముదిరిపోతుందోనన్న భయంతో ఇటీవల కురుస్తున్న అడపాదడపా చిరుజల్లులను ఆధారంగానూ, సమీపంలోని కుంటల్లోనూ చేరిన నీటితో రైతులు వరి నాట్లు వేసుకొనేందుకు సన్నద్ధమయ్యారు. ఖరీఫ్‌కు అవసరమైనంత ఎరువులను రైతులకు సరఫరా చేస్తామని ముందస్తుగా ప్రకటించిన జిల్లా అధికారులు తీరా ఉభాలు ప్రారంభించే సరికి ఎరువులో సరఫరాలో విఫలమయ్యారు. రైతుకు కేవలం ఒక బస్తా యూరియా, ఒక బస్తా గ్రోమోర్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఎక్కువ భూములున్న రైతులు ఇబ్బందులకు గురౌవుతున్నారు. నిబంధన మేరకు ఐదు ఎకరాలు ఉన్న రైతుకు ఐదు బస్తాల యూరియా పంపిణీ చేయాల్సిఉన్నప్పటికీ మండల వ్యవసాయ అధికారులు నచ్చచెప్పి కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. గ్రామంలోనే రైతు సేవా కేంద్రాలు ఉన్నప్పటికీ ఒక్కొక్క బస్తాకు నిర్ణీత ధర కంటే పది నుంచి 20 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. దీనికి కారణం రవాణా ఖర్చులు అని చెప్పడంతో రైతులు విస్తుపోతున్నారు. ఈ విషయమై మండలంలోని జమదాల ఎంపీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారుల ప్రకటనలు మేరకు ఎరువుల సరఫరా జరగడ లేదని, వారి మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు మండలాల్లో పర్యటించి రైతుల పరిస్థితులను గమనిస్తే క్షేత్రస్థాయిలో కర్షకులు పడిన ఇబ్బందులు అర్థమవుతాయని వాపోతున్నారు.

ఎరువులకు కొరత లేదు...

ఎరువుల కొరత విషయమై జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ స్పందిస్తూ ప్రస్తుత ఖరీఫ్ 2024 అవసరాలకు గాను 45,277 మెట్రిక్ టన్నుల ఎరువులను జిల్లాకు కేటాయించామని, ఇప్పటి వరకు 31,306 టన్నుల ఎరువుల పంపిణీ జిల్లాకు జరగ్గా, అందులో 18,525 టన్నుల ఎరువులను రైతులు ఇప్పటికే వినియోగించగా, ఇంకా జిల్లాలో 12,781 మెట్రిక్ టన్నుల నిల్వలు రైతులకు నేటి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత కల్పించినా, నిబంధనలను అతిక్రమించి ఎరువులను పక్క జిల్లాలకు లేదా రాష్ట్రాలకు తరలించినా, సదరు డీలర్లు లేదా వ్యక్తులపై సమాచారాన్ని సంబంధిత వ్యవసాయ అధికారులకు ఇవ్వాల్సిందిగా కోరారు. అలాగే జిల్లావ్యాప్తంగా మండల వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేసి రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపడుతామని ప్రకటనలో తెలిపారు.

గృహనిర్బంధంలో ఉన్న అవినాష్

సిపిఎం నాయకుల
హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితుల భూ సమస్యల పరిష్కరించాలని సోమవారం చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న సిపిఎం నాయకులు కోలక అవినాష్‌ను పోలీసుల ముందస్తుగా ఆదివారం రాత్రి గృహ నిర్బంధం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్షునికి ముందస్తు నోటీసులు

పాలకొండ : చలో కలెక్టరేట్‌కు హాజరు కావద్దంటూ సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావుకు పోలీసులు ముందస్తు నోటీసు అందజేశారు. దీన్ని ఆయన ఖండించారు. జిల్లా ఉన్నతాధికారులు దళితుల న్యాయమైన భూ సమస్య తక్షణమే పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడం నేరమా?

పార్వతీపురంరూరల్ : శివ్వాం దళితుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పాల్గొనకుండా సిపిఎం, సిఐటియు, ఐద్వా, గిరిజన సంఘం, రైతు సంఘం నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రయోగించడం ప్రజాస్వామ్యానికే విఘాతమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు ఆందోళన వ్యక్తంచేశారు. ముందస్తుగా నోటీసులు ఇచ్చి కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్ని రోజులుగా తమకు న్యాయం చేయాలంటూ దళితులు నిరాహార దీక్షలు చేస్తుంటే పరిష్కరించాల్సిన అధికారులు... ఇలా ఉద్యమాన్ని అణచాలని చూడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించి, దళితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టంచేశారు.

బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

విజయనగరం టౌన్ : ఆగస్టు 2 నుండి 4 వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. సారిపల్లిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు జట్టుకు ఆరుగురు, మహిళల జట్టుకు ఆరుగురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కెవి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు పాల్గొన్నారు

నీటిమీద రాతలా పెద్ద మనుషుల ఒప్పందం

- రాతపూర్వక ఒప్పందమేదీ లేదన్న ఉమ్మడి జిల్లా పెద్ద
- అన్యాయాన్ని ఎండగట్టే ప్రయత్నంలో జర్జాపు
- చేతులెత్తేసిన మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ చైర్ పర్సన్ మార్పునకు సంబంధించి సరిగ్గా మూడేళ్ల క్రితం జరిగిన పెద్ద మనుషుల ఒప్పందం బుట్టదాఖలైంది. ఉమ్మడి జిల్లా వైసిపి పెద్ద మనుషుల సమక్షంలో కుదిరిన ఒప్పందం నీటి మీద రాతలా మారింది. ఆ ఒప్పందం అమలు చేయాల్సిన పెద్ద మనిషే దాన్ని నీరుగార్చేలా మాట్లాడడంతో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలనే ఆశ్చర్యానికి గురి చేసింది. కొద్దిరోజుల క్రితం పట్టణానికి వచ్చిన ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పెద్ద మనుషుల ఒప్పందంపై స్పష్టత ఇచ్చేశారు. ఒప్పందం రాతపూర్వకంగా జరగలేదని తేల్చి చెప్పారు. నీటి మీదలా జరిగిన నోటి ఒప్పందం చెల్లుబాటు కాదనే సంకేతాలిచ్చారు. పార్టీ కౌన్సిలర్లు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మధ్య కుదిరిన మౌఖిక ఒప్పందానికి సమాధి కట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి తరపున చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపిక విషయంలో తలెత్తిన ప్రతిష్టంభనను తొలగించేందుకు అప్పటి ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరలే చెరిసగం కాలం చైర్‌పర్సన్ పీఠంపై కూర్చునేలా ఒప్పందాన్ని తెరపైకి తెచ్చారు. వైసిపి పట్టణ సీనియర్ నాయకులు పువ్వల నాగేశ్వరరావు భార్య ఈశ్వరమ్మ, జర్జాపు సూరిబాబు కోడలు దీప్తి ఇద్దరూ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం పోటీ పడ్డారు. ఇద్దరూ చైర్‌పర్సన్ కుర్చీ కావాలని పట్టుబట్టారు. దీంతో పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు 'చెరిసగం' ఒప్పందాన్ని తెరమీదకు తీసుకొచ్చారు. ఐదేళ్ల పదవీకాలంలో మొదటి రెండున్నర సంవత్సరాలు చైర్‌పర్సన్‌గా పువ్వల ఈశ్వరమ్మ, ఆ తర్వాత రెండున్నర ఏళ్ళు జర్జాపు దీప్తి చైర్‌పర్సన్‌గా వుంటారని పెద్దలు నిర్ణయించారు. పువ్వల ఈశ్వరమ్మ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు వైస్ చైర్ పర్సన్‌గా జర్జాపు దీప్తి కొనసాగారు. ఐదేళ్ళలో రెండున్నర సంవత్సరాలు పూర్తయింది. ఆ వెంటనే సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు ఒప్పందం అమలు గురించి పెద్దల వద్ద ప్రస్తావించారు. అప్పటికి సాధారణ ఎన్నికలు సమీపించడంతో ఎన్నికల తర్వాత నిర్ణయం తీసుకుందామని పెద్దలు జర్జాపుకి నచ్చజెప్పారు. దానికి ఆయన అంగీకరించారు. ఎన్నికలు ముగిశాయి. వైసిపి ఘోర పరాజయం పాలైంది. ఒప్పందం కుదిరిన సమయంలో పెద్ద మనిషిగా వున్న రాజన్నదొర కూడా ఓటమి పాలయ్యారు. ఒప్పందం సంగతేమిటని జర్జాపు సూరిబాబు పార్టీ పెద్దలను ప్రశ్నించారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసి చివరకు కొద్ది రోజుల క్రితం పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తేల్చి చెప్పేశారు. పెద్దమనుషుల ఒప్పందం రాతపూర్వకంగా జరగలేదని, అది అమలకు నోచుకోదనే సంకేతాలు ఇచ్చారు. దీంతో జర్జాపు సూరిబాబుకు ఒప్పందంపై ఆశలు సన్నగిల్లిపోయాయి. 22మంది పార్టీ కౌన్సిలర్లు, ఇద్దరు పెద్దల సమక్షంలో జరిగిన ఒప్పందం అమలు చేయకపోవడంతో సూరిబాబు అనుచరులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ప్రత్యామ్నాయం

చూసుకునే ప్రయత్నంలో వారు తలమునకలై వున్నట్లు తెలుస్తోంది. తనకు జిల్లా పార్టీ నాయకత్వం తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒడ్డు దాటిన తర్వాత బోడి మల్లయ్య అన్న చందంగా పార్టీ జిల్లా నాయకులు ఉపయోగించుకుని ఎన్నికల తర్వాత ఇచ్చిన మాట తప్పడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

జిల్లా పెద్దపై కోపంతో పార్టీకి రాజీనామా

ఉమ్మడి జిల్లా పార్టీ పెద్దల వైఖరితో విసుగు చెందిన జర్జాపు అనుచరులు పార్టీకి రాజీనామా యోచనలో వున్నారు. పార్టీని వీడే ముందు జరిగిన అన్యాయాన్ని మీడియా ముందు ఎండగట్టాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపిక విషయంలో వైసిపి రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయం ఏమిటి, చైర్ పర్సన్ అభ్యర్థిగా ఎవరిపేరున బి ఫారం జారీ అయింది, దాన్ని చింపేసి ఎలా మార్పు చేశారు, చెరిసగం ఒప్పందం ఎలా తెరపైకి తెచ్చారు, ఎలా మోసం చేశారు అనే అంశాలపై స్పష్టత ఇచ్చి పార్టీని వీడాలని యోచిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కలలు నెరవేరుస్తాడన్న కొడుకు...

సాయి కార్తీక్ ఆత్మహత్యతో కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

అమ్మా, నాన్న, చెల్లికి దూరమైపోతున్నానంటూ సూసైడ్ నోట్

రోధిస్తున్న సాయికార్తీక్ తల్లి స్వర్ణలత (ఇన్‌సెట్‌లో మృతుడు సాయికార్తీక్)

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

తమ కలలు నెరవేరుస్తాడన్న కొడుకు కానిరాని లోకానికి వెళ్లిపోయాడని తెలిసిన ఆ తల్లి గుండె పగిలేలా ఏడ్చినా తీరేది కాదు. ఎన్నో కష్టాలు చదివించిన కొడుకు ఎంతో ఎత్తుకు ఎదుగుదాడని కలల కంటే అంతకంటే ఎత్తు నుంచి కిందకి దూకి మృతి చెందుతాడని తాము ఎప్పుడూ ఊహించలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరై రోధిస్తుంటే ఆమెను ఓదార్చడం ఎవరి తరం కావడంలేదు. కర్నూలులో త్రిపుల్ ఐటిలో శనివారం ఆత్మహత్య చేసుకున్న సాయి కార్తీక్‌నాయుడు ఇంట్లో చోటు చేసుకున్న విషాదమిది.

మండలంలోని చినకుదమకు చెందిన నల్ల వెంకటనాయుడు స్వర్ణలత కుమారుడు సాయికార్తీక్‌నాయుడు. కర్నూలు జిల్లాలోని ఐఐటి కళాశాలలో ఇసిఇ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే మొదటి సంవత్సరం ఉత్తీర్ణుడై, ద్వితీయ సంవత్సరంలో నాలుగు సెమిస్టర్లు ఫెయిల్ కావడంతో ఇటు తల్లిదండ్రులకు చెప్పలేక, మరోవైపు తన తోటి విద్యార్థులతో కలిసి తన బాధను పంచుకోలేక తీవ్ర మనస్థాపానికి గురై శనివారం మధ్యాహ్నం కళాశాలలోని 9వ అంతస్తు నుండి దూకి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటికే కళాశాల యాజమాన్యం చినకుదమలో సాయి కార్తీక్ తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించగా వెంటనే తండ్రి వెంకటనాయుడు హుటాహుటిన విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుండి కర్నూలు వెళ్ళాడు. ఆదివారం సుమారు 12 గంటల సమయంలో మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తి చేసి పోలీసులు అప్పజెప్పారు. మృతుడు సాయి కార్తీక్ నాయుడు తండ్రి వెంకటనాయుడు వ్యవసాయం చేస్తుండగా, తల్లి అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తుంది. చెల్లి పూజిత పశ్చిమగోదావరి జిల్లా నూజివీడులో త్రిబుల్ ఐటి చదువుతుంది.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

గిరిజన విద్యారంగాన్ని రక్షించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన విద్యారంగాన్ని రక్షించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి రమేష్, ఎస్.మురళీమోహన్రావు అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం విధానాల వల్ల విద్యా రంగం నాశనమైందని, అందులో భాగంగా గిరిజన విద్యా వ్యవస్థ కూడా దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోను, జిపిఎస్ పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు కొరత ఉందన్నారు. గిరిజన విద్యాభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సీతంపేట ఐటిడిఎలో సిఆర్‌టిలను రెన్యువల్ చేస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని పిఒను కోరారు. అలాగే యుటిఎఫ్ ఆవిర్భావించి 50 సంవత్సరాలు పూర్తయిందని, స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.మురళి, వి.జ్యోతి, కె.గోవిందమ్మ, కె.కృష్ణారావు, పి.వెంకటనాయుడు, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

9న ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి

- జిఒ 3ను పక్కాగా అమలు చేయాలి
- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఏటా ఆగస్టు 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవం రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, జిఒ 3ను పక్కాగా అమలు చేయాలని, గిరిజన హక్కులు, చట్టాలను కాపాడాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైటిసిలో గిరిజన సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత మాజీఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడతూ రోజురోజుకు ఆదివాసీల సాంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ఆదివాసీ పండగను జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి ఆదివాసీ దినోత్సవాన్ని ప్రోత్సహించేలా నిర్వహించాలని కోరారు. ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3ను ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు వెన్నుముకగా ఈ జీవోను ఎత్తివేయడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం గిరిజనులకు కేటాయించిన హక్కులు, చట్టాలు రోజురోజుకు నిర్వీర్యమైయిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపైనా ఉందని అన్నారు. ఉందన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ఎక్కువ శాతం గిరిజన జనాభా ఉన్న గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేసి గిరిజన అభివృద్ధికి సహకరించాలని లక్ష్మణమూర్తి కోరారు. రాష్ట్రంలో ఉన్న గిరిజన ప్రాంతాల్లో సీతంపేట, పాడేరు, రంపచోడవరం, కోట రామచంద్రపురం, భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు, శ్రీశైలంలో ఐటిడిఎ ఏర్పాటు చేశారని కానీ ఒక్క మైదాన ప్రాంతమైన పార్వతీపురంలో ఐటిడిఎ ఎందుకు ఏర్పాటు చేశారని ఆయన ప్రశ్నించారు. దీంతో గిరిజన అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనేతరుల మేలు కోసమే ఐటిడిఎ ఉంది తప్ప గిరిజనులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదన్నారు. కావున గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్, ట్రైబల్స్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, దుమ్మంగి సర్పంచి పాలక క్రాంతికుమార్, గిరిజన ఉపాధ్యాయులు పత్తిక ప్రసాద్, తోయక భూషణ, పత్తిక శంకర్రావు తదితరులు ఉన్నారు.

శంభం ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పిఒ

సంతను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో జరిగే వారపు సంతను ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైనాపిల్, ఇతర గిరిజన ఉత్పత్తుల ధరలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సంత అనంతరం పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. శంభం ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మళ్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తాగునీటి సమస్యపై సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని అన్నారు. పిఒ వెంట గిరిజన సంక్షేమశాఖ ఇఇ సింహాచలం, జెఇ నాగభూషణం, ఇతర సిబ్బంది ఉన్నారు.

పిఒను కలిసిన గిరిజన ఐక్యవేదిక

స్థానిక ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డిని ఆదివారం తన ఛాంబర్‌లో గిరిజన ఐక్యవేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తుంచారు. ఆయనకు గిరిజన సమస్యలు విన్నవించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పిఒను కలిసి వారిలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు బి.తేజేశ్వరరావు, ఆరిక మన్మధరావు, అప్పన్న, ముటక రవి, సుబ్బారావు, కాంతారావు, బి. సూర్యారావు, రాజారావు ఉన్నారు.

ఎన్.ములగలో చేపడుతున్న పారిశుధ్య పనులు

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎన్.ములగ పంచాయతీ పరిధిలో సర్పంచి మడక కృష్ణవేణి, విశ్వనాథం ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి ఎంపిఓ కృష్ణవేణి, ఎంపిడిఓ ఆశిబ్ జావేద్ సూచనల మేరకు ఆదివారం పారిశుధ్య పక్షోత్సవాల సందర్భంగా జోరుగా పారిశుధ్య పనులు నిర్వహించారు. పేరుకు పోయిన వ్యర్థాలను యంత్రాలతో తొలగించి, కాలువలను శుభ్రపరిచారు. అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని రహదారులపైన పౌడరు చల్లి, దోమల నివారణకై ఫాగింగ్ నిర్వహించారు.

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా పకీర్ నాయుడు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా పార్వతీపురం మండలం పెద బొండపల్లికి మండల పకీర్ నాయుడును నియమించినట్లుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘునాథ సింహ చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల పకీర్ నాయుడు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జాగరపు ఈశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందున చెరువుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

దారి ... నీరు... వెలుగు.. ఎప్పటికి వచ్చేనో?

శంబర గ్రామ దళితుల ఆవేదన

ప్రజాశక్తి - మక్కువ

రోడ్డు సౌకర్యం లేక రాళ్లు వేసుకున్న దళితులు

ప్రభుత్వాలు ఎన్ని మారినా మా బాగోగులపై దృష్టి సారించింది తక్కువేనని మండలంలోని శంబరకు చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, రహదారి విద్యుత్, వెలుగులు తమకు ఎప్పటికి కలుగుతాయోనని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏళ్ల తరబడి తమ వీధికి సరైన రహదారి లేదని, కొలతలు వేసి వదిలేస్తారు తప్ప రహదారి నిర్మించలేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో బురదలో నడలేక రాళ్లబాట ఏర్పాటు చేసుకొని నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు వేస్తామని తెచ్చినప్పటికీ గతంలో వాటిని మరల తీసుకుపోయారని దళితుల ఆరోపిస్తున్నారు. రెండు స్తంభాలకు రూ.30 వేలు ఖర్చు అవుతుందని పంచాయతీ పెద్దలు చెప్పారని, తమ వద్ద అంత ఆర్థికస్థోమత లేదని చెప్పడంతో ఎప్పుడు స్తంభాలు తీసుకుపోయారో తెలియలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన దళితులు కోరుతున్నారు.

పాడైపోయిన రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోడ్లు బాగు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కె.రంగి-తుమరవల్లి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయిందని, వెంటనే బాగు చేయాలని ఆగ్రామ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, కోటపర్తి సింహాచలం, జర్ని శంకర్రావుతో పాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు నాయకత్వంలో రోడ్లను పరిశీలించారు. కొండమోసూరు - కొండలుద్దండి గ్రామాల మధ్య నడవలేని పరిస్థితిలో ఉన్న రహదారి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన రహదారి పూర్తిగా నాశనమైపోయిందని, ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఆ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడంతో ఈ రాళ్లు తేలిపోయి గిరిజనుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వమైనా వెంటనే స్పందించి ఈ రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఐటిడిఎ పిఒ, ఇతర ఉన్నతాధికారులు ఈ గిరిజన గ్రామాలను పర్యటించి ఈ సమస్య పరిష్కారం కోసం రోడ్లు వెంటనే వేసేలా ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు.

ఎంఇఒల బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖాధికారులు -1కు జీరో సర్వీస్ తో బదిలీలు చేపట్టాలని ఎంఇఒ-1అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటన లో కోరారు. ఎంఈవో-1లకు ఏడేళ్లుగా బదిలీలు జరగలేదన్నారు. 2017 నుంచి పని చేస్తున్న స్థానాల్లోనే చాలామంది ఎంఇఒలు పని చేస్తున్నారని, కావున బదిలీల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా మండలంలో దాదాపు 200మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఇఒ-1కు తమ జీతభత్యాలు చేసుకునే సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున ఎంఇఒ-1కు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను వినతిపత్రం అందచేసినట్లు సింహాచలం తెలిపారు.

గిట్టుబాటు ధరకే కొనుగోలు

ప్రజాశక్తి - కురుపాం

నేటివ్ ఇన్‌కో సంస్థ వారు కొనుగోలు చేసిన చీపుర్లు

గిరిజన ప్రాంతంలో పండిస్తున్న అటవీ ఫలసాయాలను గిట్టుబాటు ధరకు నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఉద్యాన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఆ సంస్థ సిఇఒ వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని నీలకంఠపురం పంచాయతీ కోసంగూడలో గిరిజనులు పండించిన చీపురు పంటలను ఆదివారం కొనుగోలు చేశారు. అనంతరం ఆ గ్రామ గిరిజనులు పంటలు సాగు చేసే విధానం, అమ్మకాలు, నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్, ఉద్యాన, వ్యవసాయ రైతు సంఘాన్ని బలోపేతం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ టెక్నికల్ సపోర్టర్ ఎస్.సోనియా, గిరిజన రైతులు ఎం.అప్పారావు, ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట వంటలు

నిర్వాహకులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - వీరఘట్టం

అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా సర్కార్ బడులు ఉన్నాయి. కనీసం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వీలుగా వంట గదులు లేకపోవడంతో వంట నిర్వాహకులకు తంటాలు పడుతున్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల 1, కెజిబివి 1, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 11, ప్రాథమిక పాఠశాలలు 39, జిటిడబ్ల్యుఎస్ 3 పాఠశాలల్లో విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. మండలంలోని చిట్టిపూడి వలస, ఎం రాజపురం, పివిఆర్ పురం, పనస నందివాడ, తల వరం, రేగులపాడు, కంబర వలస, కడకెల్లా, కొత్త కిమ్మి, పాత కిమ్మి, కొంచ, గడగమ్మ తదితర పాఠశాలలకు వంట గదులు లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయట వంటలు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు వంటగది నిర్మించినప్పటికీ అందులో వంటలు చేస్తే చుట్టూ పొగ కమ్మటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, ఆరు బయటనే వంటలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని నిర్వాహకులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వంట గదికి రేకుల షెడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అందులో వంటలు చేయక పాఠశాలకు అనుకొని అదనపు భవనంలోనే ఒక గదిలో వంటలు చేస్తున్నారు. రేకుల షెడ్డు నిర్మించినప్పటికీ అందులో [illegible] కాలంలో చేపట్టిన నాడు నేడు పనుల సామాగ్రిని అందులో వేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఇంటి దగ్గర నుంచే వంట

కోమటి పాఠశాలకు కనీసం ఆడుకునేందుకు ఆట స్థలం లేకపోవడంతో పాటు వంట చేసేందుకు గది కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఇంటి వద్ద వంటలు చేసి భోజన సమయంలో పాఠశాలకు భోజనాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ స్కూలుతో పాటు పెద్దూరు, సంధిమాను గుడ, అచ్చిపువలస, కే ఇచ్చాపురం, కొంచ పాఠశాలలకు నిర్వాహకులు ఇంటి వద్దనే వంటలు చేసి భోజనాలు తీసుకువచ్చి విద్యార్థులకు అందిస్తున్నారు.

ఒకే గదిలో పాఠాలు.. వంటలు

యు.వెంకంపేట పాఠశాలకు ఒకే ఒక భవనం ఉండటం వల్ల అందులోనే విద్యార్థులకు బోధన అందులోనే విద్యార్థులకు వంటలు చేసి భోజనాలు అందించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడగమ్మ గ్రామంలో వంటగది నిర్మించాలని పదేపదే విద్యాశాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు సహకారంతో పందిరి ఏర్పాటు చేసి వాటిపై సిమెంట్ రేకులు వేసి అందులో వంటలు చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలు కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురై

వీరఘట్టం బాలికల ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదిలో వంటలు వండుతున్న నిర్వాహకులు

గడగమ్మ గ్రామంలో రేకుల కింద వంటలు చేస్తున్న నిర్వాహకురాలు

వంటలు చేసి విద్యార్థులకు భోజనాన్ని అందించవలసి వస్తుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంట చెరకతోనే..

పొగను నిర్మూలించేందుకు గత టిడిపి ప్రభుత్వం గ్యాస్ సరఫరాకు శ్రీకారం చుట్టింది. గ్యాస్ వినియోగం ఎక్కువ రోజులు రాకపోవడంతో చేసేది ఏమి లేక వంట చెరకు పైన ఆధారపడి వంటలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది మే 29వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీలకు ఒక్కరోజు శిక్షణ తరగతి ఏర్పాటు చేసినప్పుడు ఈ శిక్షణా కార్యక్రమానికి పార్వతిపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి జి పగడాలమ్మ హాజరై ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలని ఏజెన్సీలకు అడిగితే అదనంగా గ్యాస్ కావాలని నిర్వాహకులు మొర పెట్టడంతో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పినా, నేటికీ హామీ అమలు కాకపోవడంతో వంట చెరుకుతోనే వంటలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వంట గదులు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వంట నిర్వాహకులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఇఒ-2 ఆర్ ఆనంద రావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా వంట గదులకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

పేదలకు చేసిన సేవలు సంతృప్తినిచ్చాయి

వైద్యాధికారి డాక్టర్ వి.గౌరీశంకర్

ప్రజాశక్తి - సీతంపేట

తన విధి నిర్వహణలో అనేక మంది పేదలకు వైద్య సేవలందించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని స్థానిక ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఒ, మత్తు వైద్యనిపుణులు డాక్టర్ వారణాసి గౌరీశంకర్ అన్నారు. 28 ఏళ్ల పాటు ప్రజలకు అందించిన సేవలకు గానూ అనేక తాను అవార్డులు, రివార్డులను అందుకున్నానని తెలిపారు. ఇప్పటి వరకూ తాను 45వేల కుటుంబం నియంత్రణ శస్త్రచికిత్సలు చేసి శభాష్ అనిపించుకున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిగా అవతరించిన తర్వాత ఈనెల 31న మొట్టమొదట ఉద్యోగ విరమణ కానున్న వైద్యాధికారి డాక్టర్ గౌరీశంకర్. ఈ సందర్భంగా ఆయన తన ఉద్యోగ జీవితాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు. వివరాలిలా ఆయన మాటల్లోనే...



విజయనగరం జిల్లా బొబ్బిలి చెందిన వారణాసి సూర్యనారాయణ, రవణమ్మ దంపతుల పెద్ద కుమారుడ్ని నేను. నాతో పాటు తమ్ముడు, నలుగురు అక్క చెల్లెళ్లు ఉన్నారు. 1961లో జన్మించిన తాను ఒకటి నుండి ఇంటర్ వరకు బొబ్బిలి లో విద్యను అభ్యసించాను. 1986లో విశాఖపట్నంలోని ఎంబిబిఎస్, 1994లో పిజి పూర్తిచేసి ఎనాస్థియన్ నిపుణులుగా పట్టపొందారు. 1996లో మొట్ట మొదటి సారిగా మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అనంతరం 2002లో బొబ్బిలిలో పిపి యూనిట్ హాస్పిటలకు బదిలీ అయ్యింది. 2007లో జివిఎంసి విశాఖకు బదిలీ అయ్యింది. 2013 వరకు పిపి యూనిట్‌లోనే ఫ్యామిలీ ప్లానింగ్ కుటుంబ నియంతన ఆపరేషన్లు వైద్యాధికారిగానూ, 2013లో కురుపాం సిహెచ్‌సికి బదిలీ అయ్యింది. 2022లో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మత్తు వైద్య నిపుణులుగా, ఇన్చార్జి ఆర్ఎంఒగా బాధ్యతలు స్వీకరించి, ఇక్కడే ఉద్యోగ విరమణ చేస్తున్నాను. తన విధి నిర్వహణలో అనేక అవార్డులు, రివార్డులు పొందాను. కురుపాం, బొబ్బిలి సిహెచ్‌సిల్లో సూపరింటెండెంట్‌గానూ, మక్కువ పిహెచ్‌సి వైద్యాధికారిగానూ, సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఆర్ఎంఒగా పనిచేసి తోటి వైద్య అధికారుల సహకారంతో మంచి వైద్యాధికారిగా పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. ఇప్పటికే 45వేల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన ఘనత నాకు దక్కింది. నాటి కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు, విశాఖపట్నం కలెక్టర్ చేతుల మీదుగా ఎన్నో అవార్డులు రివార్డులు అందుకున్నారు.

1993లో జ్యోతితో నాకు వివాహమైంది. మాకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు భాను ప్రకాష్ ఎండి జనరల్ మెడిసిన్ చేశారు. విశాఖపట్నం ఎన్నారై మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు హర్షవర్ధన్ ఎంబిబిఎస్ పూర్తి చేశారు. పిజికి సన్నద్ధమవుతున్నాడు.

అర్థాంతంగా నిలిచిపోయిన పాఠశాల భవనం

అసంపూర్తిగా ఆశ్రమ పాఠశాల భవనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం మధ్యలో పనులు ఆగి దిష్టిబొమ్మల దర్శనమిస్తుంది. 2022లో ఐటిడిఎ ద్వారా రూ.10 కోట్లు నిధులతో మంజూరు చేసి భవనం నిర్మాణం చేపట్టి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యం నేటికి మూడేళ్లు అవుతున్నా పూర్తి కాలేదంటే ప్రభుత్వ నిర్లక్ష్యమా లేక అధికారుల పర్యవేక్షణా లోపమో తెలీదు. పనుల విషయమై సంబంధిత కాంట్రాక్టరును అడగ్గా రూ.2కోట్లు పైబడి పెండింగ్ ఉండడంతో పనులు నిలిపివేశామని తెలిపారు. ఏది ఏమైనా గిరిజన విద్యార్థులకు మాత్రం నేటికీ పక్కా భవనం అందని పరిస్థితి ఏర్పడింది. కావున ఈ నూతన ప్రభుత్వమైన తక్షణమే భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు ఈ ఏడాదికైనా అందించాలని కోరుతున్నారు.

నేడు పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వివిధ రకాలుగా 6ఎ కేసుల్లో మండల పరిధిలో పట్టుబడిన 17.23 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సోమవారం సాయంత్రం 4గంటలకు వేలం వేస్తామని ఉపతాహాశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

నేడు చలో కలెక్టరేట్

ప్రజాశక్తి -కొమరాడ

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులకు మద్దతుగా, దీర్ఘకాలంగా పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం గుమడ సంతలో ప్రచారం చేశారు. చలో కలెక్టరేట్‌లో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, తదితరులు ఉన్నారు.

అందరివాడు కరణం నారాయణరావు

ప్రజాశక్తి-పాలకొండ

అందరివాడు, మంచి వ్యక్తి నారాయణరావును కోల్పోయామని తోటపల్లి ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మెన్ నిమ్మక పాండురంగ అన్నారు. మండలంలోని కొండాపురం ఎంపిటిసి ప్రతినిధి కరణం నారాయణరావు సంతాప సభలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాండురంగ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి ప్రజా సేవ కోసం పరితపించే వ్యక్తి నారాయణరావు అని కొనియాడారు. పార్టీ అధికారంలో లేనప్పటికీ సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన వ్యక్తి నారాయణరావు అని, పార్టీలో చురుగ్గా వుండి అందరికీ అండగా పెద్దదిక్కుగా ఉండే వ్యక్తి ఆకస్మికంగా మరణించడం చాలా బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కరెన్న అప్పల నాయుడు, వెన్నపు శ్రీను, గండి రామినాయుడు, కోట సంఘంనాయుడు, తేజోవతి, చెబోదుల లక్ష్మినారాయణ, మహేంద్ర, దోపాంక సాయి, కుటుంబసభ్యులు మురళీ, గౌతమ్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోటకు చేరుకున్న పూర్వ విద్యార్థులు

కోటిపాం పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఆదివారం కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచికి చెందిన విద్యార్థులంతా కలిసి తాము చదువుకున్న పాఠశాలలో ఒకచోట కలుసుకొని తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. వారంతా వివిధ రంగాల్లో స్థిరపడి 25 ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు రామచంద్రరెడ్డి, గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

467 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో వివిధ సందర్భాల్లో పట్టుబడి ఏడు వాహనాలు, అలాగే ఆటో వేలం వేయనున్నట్టు పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. అలాగే వివిధ సందర్భాల్లో పట్టుబడిన 467 లీటర్లు మద్యం, నాటు సారాయిను ధ్వంసం చేశామన్నారు. వీటిలో నాటుసారాకు సంబంధించిన 8కేసులు, అబ్కారిశాఖకు చెందిన 13 కేసులు నమోదు చేశామని తెలిపారు.

కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుత హైటెక్ యుగతంలో కళలు అంతరించపోతున్నాయని, ప్రజలను చైతన్య పరిచేందుకు కళలు ఎంతగానో దోహదపడతాయని, కావున వీటిని ప్రోత్సహించాలని రాష్ట్ర కళాకారుల సంఘ అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయ పిలుపునిచ్చారు. మండలంలోని తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ధనుంజయ మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు భారతదేశమని, వివిధ సంస్కతుల సమ్మేళనంలో ఉన్న ప్రజలు అనేక కళా రూపాలను కలిగి ఉన్నారని అన్నారు. రాచరిక వ్యవస్థ నుంచి కళాకారులకు ప్రభుత్వ మంచి ఆదరణ లభించేదని, ప్రస్తుత ప్రభుత్వాలు కళాకారులను, కళలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన చింతామణి నాటకాన్ని ఆపివేయడం అమానుషమన్నారు. ఈ నాటకాన్ని నమ్ముకుని అనేక వేలమంది జీవనం సాగించి ఉన్నారని, గత ప్రభుత్వం ఈ నాటకాన్ని నిలిపివేయడం సరైన పద్ధతి కాదని, ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. ప్రజలను చైతన్య పరిచేందుకు కళ లు ఎంతగానో ఉపయోగపడతాయని, గత ప్రభుత్వం కళాకారుల ప్రయోజనాలను పూర్తిగా విడిచిపెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక, వికలాంగుల పింఛన్ మాదిరిగా కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి కళాకారుడికి పింఛన్ వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే కళారూపాలు ఎంతగానో ఉపయోగపడతాయని, సామాన్య ప్రజలను చైతన్య పరచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యక్తి మానసిక ఉల్లాసానికి, వికాసానికి సంగీతం ఎంత దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో అనేకమంది కళాకారులు దిక్కుతోచని స్థితిలో

అభివాదం చేస్తున్న కళాకారులు

ఉన్నారని, కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కళారూపాలు కనుమరుగవుతున్నాయని, యువతకు శిక్షణ కార్యక్రమాలు నెరవేర్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సంఘ సలహాదారులు ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే కళారూపాలు కనుమరుగవుతున్నాయని, ప్రభుత్వాలు కళారూపాలను ప్రోత్సహించకపోవడం దారుణమన్నారు. భావితరాలకు కళల పట్ల ఆసక్తి కలిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులు కె. మంగాదేవి, రాష్ట్ర కార్యదర్శి మిమిక్రీ శివ (శ్రీకాకుళం), కోశాధికారి మువ్వల వెంకటరమణ (విశాఖ), కార్యవర్గ సభ్యులు మహాలింగప్ప (కర్నూలు), కుళ్లయ్యప్ప (అనంతపురం), వరప్రసాద్ (ప్రకాశం), రాజబాబు (కాకినాడ), వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నేటి సమాజంలో ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతాంగం దృష్టిసారించి సాగును పెంచుకోవాలని రీజనల్ టెక్నికల్ లీడ్ అధికారి కె.ప్రకాష్ తెలిపారు. మండలంలోని పెదబొండపల్లి, బందలుప్పి, అంటివలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కూరగాయల్లో పలు పంటలు వేసే విధానం పైన, వరిలో బాటలు తీయడం ఆచరించే పద్ధతి పైన, కొసలు తుంచి నాట్లు వేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయసాగు వల్ల భూమికి, వాతావరణానికి, మానవాళికి ఎంతో మంచి జరుగుతుందన్నారు. నేటి సమాజంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అధిక డిమాండ్ ఉందన్నారు. రసాయన ఎరువులు లేని పంటల కొనుగోలుపై అన్ని వర్గాల దృష్టి సారించారన్నారు. రైతాంగం కూడా ప్రకృతి వ్యవసాయ సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగులో రైతులకు కావాల్సిన అవగాహనా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ప్రకృతి వ్యవసాయంలోనే సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయ సాగులో ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగానికి సంబంధించిన మోడల్ మేకర్లు, మెంటర్లు, వ్యవసాయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఆర్‌టిఎల్ అధికారి ప్రకాష్

నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఐఎఎస్ సంస్థ సభ్యులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ఆదివారం నిరుపేదలకు ఐఎఎస్ సంస్థ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఎస్ఐ పాపారావు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వెలది సుబ్బారావును సన్మానించారు. అనంతరం 120 మంది నిరుపేదలకు ఐదు కేజీల బియ్యం బస్తా, ఒక దుప్పటి, రూ.250 విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐఎఎస్ సంస్థ ద్వారా మండలంలోని 120 మంది నిరుపేదలను గుర్తించామని, వీరికి రూ.లక్షా20వేల విలువైన నిత్యవసర సరుకులు అందజేసేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇది కొనసాగుతుందని, కావున అంతా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐఎఎస్ సీనియర్ లీడర్లు నారాయణ స్వామి, హరికృష్ణ, వెంకి, చిన్న, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కొండపై నుంచి జారిపడి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని పద్మాపురానికి చెందిన కంటా రమేష్(34) కొండపై నుంచికిందికి జారిపడి మృతి చెందాడు. రమేష్ ఈనెల 23న ఇంటి నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతం ఈతమానవలస గ్రామం సమీపంలో రమేష్ మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నమోదు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.